క్లుప్తంగా

విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లను పంపిణీ చేస్తున్న అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమలాపురం అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్ట్ ఉచితంగా ఆర్టీసీ బస్సు పాస్‌లను అందజేసింది. పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు ట్రస్ట్ ప్రతినిధులు ప్రవాస భారతీయుడు అబ్బిరెడ్డి మల్లేష్, జంగా శేషు, గుర్రాల మూర్తి, అబ్బిరెడ్డి మూర్తి తదితరుల చేతుల మీదుగా మంగళవారం బస్సు పాస్‌లను పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా రుద్ర హోమం



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహాశివుని జన్మ నక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతి నెలా రుద్ర హోమం నిర్వహిస్తారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి



అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని స్తంభానికి కట్టి వేసిన స్థానికులు

ఐ.పోలవరం: ఓ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని స్తంభానికి కట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం జరిగింది. కేశనకుర్రు గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావు మురమళ్ల సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అతనిని స్థానికులు పట్టుకుని, స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

భారీగా అన్నసమారాధన

యానాం: నియోజకవర్గ పరిధిలో దొమ్మేటి పేటలో కొలువైన కనకదుర్గమ్మవారి ఆలయంలో నవరాత్ర మహోత్సవాలను ముగింపును పురస్కరించుకుని మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మాజీ ముమ్మిడివరం మార్కెటింగ్ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, గుత్తుల రామారావు తదితరులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

జూనియర్ ఇంజినీర్ పరీక్షకు ఆరు సెంటర్లు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో పీడబ్ల్యూడీ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీర్, సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ఈనెల 27 న నిర్వహించే రాతపరీక్షకు ఆరు కేంద్రాలను కేటాయించినట్టు మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్షకేంద్రం చిరునామా కొందరికి ప్రింట్ పడలేదని కావున వాటి కోసం అభ్యర్థులు మళ్లీ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరింది. పుదుచ్చేరి ముతిలైపేట భారతీదాసన్ ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల, శంకర విద్యాలయ హైస్కూల్, చిల్లప పెరుమాళ్‌పేట వివేకానంద హైస్కూల్, ఠాగూర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, లాస్‌పేటలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు కార్యదర్శి జయశంకర్ తెలిపారు.

నేటి నుంచి రీ సర్వే గ్రామసభలు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాళ్లరేవు మండల పరిధిలో ఈనెల 23నుంచి నవంబర్ 8 వరకు రీ సర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పితాని త్రినాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి గ్రామసభ చొల్లంగి గ్రామంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రైతులు ఈ రీసర్వే సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఐ.పోలవరం: యానాం - ఎదుర్లంక బలయోగి వారధిపై గల ఐదో పిల్లర్ ఫుట్‌పాత్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుడి సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు ఉంటుంది. తెలుపు రంగు పొడవు చేతులు చొక్కా, ముదురు నాచురంగు ప్యాంటు ధరించాడు. అతడి ఆచూకీ తెలిసిన వారు ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

పాత సరకు.. షాకిచ్చిన ధర

- మందుబాబులకు కళ్లు తిరిగే రేట్లు
- అందుబాటులో లేని రూ.99ల మద్యం



కాట్రేనికోన మండలంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు

ముమ్మిడివరం: మద్యం ప్రియులకు కూటమి ప్రభుత్వం దిమ్మదిరిగే షాక్ ఇచ్చింది. మద్యం ధరలను తగ్గిస్తాం,నాణ్యమైన బ్రాండులను అందుబాటులోకి తెస్తాం... క్వార్టర్ మద్యం రూ.99లకే విక్రయిస్తాం అంటూ గొప్పల డప్పు కొట్టిన ప్రభుత్వం అధిక ధరలతో మందుబాబుల జేబులకు చిల్లు పెడుతోంది.తక్కువ ధరకు బ్రాండ్ మద్యం దొరుకుతుందని మద్యం షాపులకు వెళ్లిన వారు అక్కడ వసూలు చేస్తున్న ధరలను చూసి కళ్లు తేలేస్తున్నారు. గతంలో కంటే రూ.30 నుంచి రూ.40 పైగా ధర పెంచి విక్రయిస్తుండడంతో విస్తుపోతున్నారు. కొత్త విధానం పేరుతో ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసిన కూటమి సర్కార్, అక్కడ పనిచేస్తున్న చిరుద్యోగుల ఉపాధిని లాగేసుకుని వారిని రోడ్డు పాలు చేసింది.ఇప్పుడు టెండర్ల ద్వారా కేటాయించిన మద్యం షాపులు ప్రారంభయమ్యాయి. ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముమ్మిడివరం నగర పంచాయతీతోపాటు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో 13 మద్యం షాపులు కేటాయించారు. అయితే వాటిలో కొత్త మద్యం అందుబాటులోకి రాలేదు. పాత మద్యాన్ని ధరలు పెంచి విక్రయించడం మద్యం ప్రియులను అసంతృప్తికి గురి చేస్తోంది. కొన్ని చోట్ల కొత్త బ్రాండ్ పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారని మందు బాబులు వాపోతున్నారు.

అందుబాటులో కొన్ని బ్రాండ్లే..

ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గిస్తామని, క్వార్టర్ రూ.99కే అందిస్తామని హామీలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చాక దానిని ఆచరణలో పెట్టలేదు. ఇప్పుడు టెండర్లు పిలిచి అత్యధిక దుకాణాలు తమ అనుచరులకు కట్ట బెట్టారనే చర్చ జరుగుతోంది. రూ.99 బ్రాండ్‌ను అందుబాటులోకి తీసుకురాకపోగా గత ప్రభుత్వ హయాంలో సరఫరా అయిన మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అత్యధిక షాపుల్లో క్వార్టర్ విస్కీ రూ.180లు, మాన్షన్ హౌస్ రూ.220, చీప్ లిక్కర్ రూ.180, చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈబ్రాండ్లే అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. ముమ్మిడివరం ప్రొహిబిసన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 షాపులను దక్కించుకున్న వ్యాపారులకు.. అధికారులు తాత్కాలిక లైసెన్స్ జారీ చేశారు. వారి లైసెన్సు ఫీజులో ఆరోవంతు డబ్బు వసూలు చేశారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించాక రెండేళ్ల కాల పరిమితితో లైసెన్సు జారీ చేయనున్నారు.

చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

ముమ్మిడివరం: చిరు వ్యాపారులకు సబ్సిడీ రుణాలు అందించాలని చిరువ్యాపారుల సంఘం విజ్ఞప్తి చేసింది. పట్టణ పేదరిక నిర్మూలన, జాతీయ పట్టణ జీవనోపాధి పథకం అవగాహన సదస్సు స్థానిక కేశవ స్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం కొయ్యల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, వారి వ్యాపారాభివృద్ధికి సబ్సిడీతో కూడిన రుణాలు మాంజూరు చేయాలని కోరారు. ఈసమావేశంలో మునుకోటి రాంబాబు, ఎండీ సాయి బాబా, కోనేరామ్మూర్తి, తాడాల సుబ్బారావు, నాగ రాజేశ్వరి, చీపురుపల్లి కిట్టయ్య, సంసాని వెంకట రావు, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక భవనంలో కోర్టు కార్యకలాపాలు

న్యాయకార్యదర్శి సత్యమూర్తి



కోర్టు తాత్కాలిక భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి



పోలీస్‌స్టేషన్‌లో సత్యమూర్తిని సత్కరిస్తున్న ఎస్పీ రాజశేఖరన్ తదితరులు

యానాం: ఫ్రెంచ్ వారి హయాంలో నిర్మించి యానాం సబ్‌కోర్టు ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని, ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక భవనంలో ఇకపై కోర్టు కార్యకలాపాలు నిర్వహించాలని పుదుచ్చేరి న్యాయశాఖ కార్యదర్శి ఎల్ సత్యమూర్తి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న యానాం సబ్ కోర్టు భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. శ్లాబు పైభాగం నుంచి వర్షపునీరు లీకవడం, వివిధ కేసులకు సంబంధించి ఫైల్స్ సైతం పాడైపోవడం, భవనం ప్రమాదకరంగా ఉన్న పరిస్థితిని ఆయన గుర్తించారు. అనంతరం న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సబ్‌కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకుందని, ఆ భవనంలో కోర్టు కార్యకలాపాలు నిర్వహించడం ప్రమాదకరమన్నారు. కావున స్థానిక విష్ణాలయం వీధిలో మున్సిపల్ కల్యాణమండపంలో తాత్కాలికంగా సబ్‌కోర్టు కార్యకలాపాలు సాగుతాయన్నారు. న్యాయవాదులు, జడ్జి చర్చించుకుని, తేదీ నిర్ణయించి, అక్కడకు తరలి వెళ్లాలన్నారు. తాత్కాలిక కోర్టును సిద్ధం చేసే పనులను స్థానిక పీడబ్ల్యూడీ అధికారులు ప్రారంభించారని, మరో వారం రోజుల్లో అప్పగించనున్నారని చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో నూతన కోర్టు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని, వెంటనే కోర్టు భవనం నిర్మాణం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏవో మునిస్వామి, జడ్జి రాజ్‌మోహన్, ఎస్పీ రాజశేఖరన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గా శ్రీనివాస్, న్యాయవాదులు కమిడి విజయకుమార్, ఎన్.ఎస్.ఎన్. రాజు, పి.వి. సుబ్బారావు, పేర్ని ఆదినారాయణ మూర్తి,బాషా, నారాయణ, రామకృష్ణ, స్వరాజ్యలక్ష్మి, అంబిక, కనకాల రామదాసు, మోక్షిత, సీఐ షణ్ముగం, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక సబ్ కోర్టు పరిశీలన...: మున్సిపల్ కల్యాణమండపాన్ని తాత్కాలిక సబ్‌కోర్టుగా తీర్చిదిద్దడంతో దానిని న్యాయశాఖ కార్యదర్శి సత్యమూర్తి పరిశీలించారు. పీడబ్ల్యూడీ అధికారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌ను సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సత్యమూర్తిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు.

ఐక్యతతోనే శెట్టిబలిజల రాజకీయ ఎదుగుదల

వచ్చే నెల 24న కార్తిక వన సమారాధన నిర్వహణకు నిర్ణయం



శెట్టిబలిజల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సుభాష్. చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: ఐక్యతతోనే శెట్టిబలిజల రాజకీయ ఎదుగుదల సాధ్యమవుతందని మంత్రి సుభాష్ అన్నారు. స్థానిక కొంకాపల్లి శివారు సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో శెట్టిబలిజల ఆత్మీయ సదస్సు మంగళవారం జరిగింది. సుభాష్ అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సదస్సుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా శెట్టిబలిజ ప్రజాప్రతినిధులు, నాయకలు హాజరయ్యారు. వచ్చే నెల 24న ఇదే చోట శెట్టిబలిజల కార్తిక వన సమారాధన నిర్వహించాలని సదస్సులో నిర్ణయించారు. ఈ కార్తిక వన సమారాధనకు అయ్యే ఖర్చును తన తండ్రి, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం భరిస్తారని సుభాష్ తెలిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ శెట్టబలిజల ఐక్యత గురించి వివరించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో పాటు శెట్టిబలిజ సంఘాల నాయకులు వనుము సత్య కళ్యాణి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.అనంతరం మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం కార్తీక వన సమారాధనకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటి నుంచే పర్యవేక్షణకు ముఖ్య నాయకులతో చర్చించారు.

విద్యార్థులకు ఎండ్ లైన్ పరీక్షలు



పల్లంలో ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఎండ్ లైన్ పరీక్షలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూధనరావు

కాట్రేనికోన: పూర్వ ప్రాథమిక విద్యకు పునాది వేసేందుకు విద్యాశాఖ ప్రవేశ పెట్టిన విద్యా ప్రవేశ్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థులకు ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహించినట్లు డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ. మధుసూధనరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి రాంబాబు చెప్పారు. మండల పరిధిలోని పల్లం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఎండ్ లైన్ పరీక్షలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 1,285 మంది ఉపాధ్యాయులకు 14 బ్యాచ్‌లలో విద్యా ప్రవేశ్ ప్రాజెక్టుపై శిక్షణ అందించామన్నారు. విద్యా ప్రవేశ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 90 రోజుల పాటు ఒకటవ తరగతి విద్యార్థులకు రోజుకు రెండు గంటల చొప్పున ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. ఆట, పాటలతో పాటు తెలుగు, గణితంపై ఒకటవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని చెప్పారు. మండలంలో పల్లం, బ్రహ్మసమేధ్యం, చిర్రయానం ప్రాథమికోన్నత పాఠశాలలు విద్యా ప్రవేశ్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైనట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో ఇన్వెస్టిగేటర్స్ పి.సత్యనారాయణ, పి.ఏడుకొండలు, ఎ.వి.వి. వర్మ, సీఆర్ఎంటి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇంటివద్దకే రేషన్ పంపిణీ

యానాం: ఉచితబియ్యం, ఇతర నిత్యావసర సరుకులను లబ్ధిదారుల ఇంటివద్దకే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎల్జీ కె. కైలాష నాథన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఇటీవల న్యూఢిల్లీ వెళ్లినప్పుడు పుదుచ్చేరి,యానాం,మాహే, కారైకల్ లలో ఉచితబియ్యం పంపిణీ అమలు చేయాలన్న ప్రజల డిమాండ్‌ను ప్రధాని మోడీకి తెలియజేసినట్టు తెలిపారు. ఆయన తక్షణం ఆ డిమాండ్‌ను ఆమోదించారన్నారు. ఉచిత బియ్యం పంపిణీ ద్వారా ప్రజల జీవనోపాధిలో మార్పులు వస్తాయన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రతిభా అవార్డులు పొందిన బాలికలతో ఉపాధ్యాయులు

యానాం: ఉన్నతశిఖరాలు అధిరోహించేలా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని విస్తృతం చేసుకోవాలని స్థానిక శారదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్వ విద్యార్థిని, ఆయన కుమార్తె దివంగత చిక్కాల లక్ష్మీసునంద జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం లక్ష్మీసునంద ప్రతిభా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా 6 నుంచి 10 వ తరగతి వరకు టాపర్స్‌గా నిలిచిన బాలికలకు రూ.2వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, షీల్డు అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఇద్దరు బాలికలకు ప్రత్యేక బహుమతులు అందజేయడంతో పాటు జాతీయస్థాయి ఆటలపోటీల్లో పుదుచ్చేరి తరఫున పాల్గొని బంగారు పతకం సాధించిన విద్యార్థినిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ చింతా వెంకన్న, లైబ్రేరియన్ కందుకూరి సురేష్‌కుమార్, టీజీటీ సాలిగ్రామ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు సేవా భిక్ష



అన్నప్రసాదం(భిక్ష) స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

- మాలధారణ భక్తులకు నిర్విరామంగా అన్నసమారాధన
- 18 ఏళ్లుగా కొనసాగిస్తున్న అను బ్రదర్స్

ముమ్మిడివరం: స్వామియే శరణం అయ్యప్ప అంటూ 41 రోజుల మండల దీక్ష చేపట్టిన స్వామి భక్తులకు వారు నిర్విరామంగా భిక్ష అందిస్తూ అయ్యప్పల సేవలో తరలిస్తున్నారు. నల్లని దుస్తులు, మెడలో మణిహారం,నుదుటన చందనంతో కనిపించే ఆసు మాణిక్యాలరావు, నాగరాజు సోదరులు పద్దెనిమిది ఏళ్లుగా అయ్యప్ప స్వామి మాలాధారణ చేయడంతో పాటు మురమళ్ళ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 100 నుంచి 150 మంది భక్తులకు ఉచిత అన్నదానం(భిక్ష)అందిస్తున్నారు.ఐ.పోలవరం మండలం కొమరగిరికి చెందిన వీరు వ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 18 ఏళ్ల క్రితం మాలధారణ చేసినప్పటి నుంచి ప్రతి ఏటా మాలధారణ భక్తులకు ఉచితంగా భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో వ్యాపార సముదాయాలను నిర్మించి పైఅంతస్తులో అయ్యప్ప పీఠం ఏర్పాటు చేశారు. సుమారు 70 మందికి మాలాధారాణ చేశారు. దీక్ష అనంతరం ఏటా రెండు,మూడు బస్సుల్లో అయ్యప్ప భక్తులను శబరిమల తీసుకువెళ్తారు.

రాష్ట్రంలో అరాచక పాలన

వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజం



ఉప్పలగుప్తంలో సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్ అక్రమ అరెస్ట్ పట్ల స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాజ్యాంగానికి విలువ లేకుండా పోయిందన్నారు. కక్ష సాధింపు దిశగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధించే దిశగా అధికార దుర్వినియోగం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించారని చెప్పారు. నాలుగు నెలల పాలనలో ప్రజలకు సంక్షేమం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. యువ నాయకుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేయించడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వ కక్ష రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో బుద్ధి చెప్పి, సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలుకుతారన్న పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలయ్య, జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరావు, సర్పంచుల సమైఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నమరాజు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుముడి కొండబాబు, పార్టీ సీనియర్ నాయకులు చీకట్ల కిషోర్, దంగేటి దొరబాబు, బడుగు గణేష్, యాళ్ల చిన్న, మానే శ్రీను, నల్లా నాయుడు, చేట్ల విద్యాసాగర్, మారిశెట్టి పుండరీకాక్షుడు, దేవరపల్లి నాని, నల్లా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



మరమ్మతులకు ముందు సుంకరపాలెం రహదారి



గోతులను జేసీబీతో పూడ్చి చదును చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

తాళ్లరేవు: యానాం-ద్రాక్షారామ రహదారిలోని సుంకరపాలెం వద్ద పడిన గుంతలను గ్రామ పంచాయతీ అధికారులు పూడ్చారు. ఈ నెల 19 న అధ్వానంగా రహదారులు శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సమస్యను మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, స్థానిక నాయకులు చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు పర్యవేక్షణలో గుంతలను పూడ్చి, చదునుచేశారు. రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టామని శాశ్వతప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ అధికారులదని చెప్పారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు చొల్లంగి బాలికలు



రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

తాళ్లరేవు: రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు మండల పరిధిలోని చొల్లంగి జెడ్పీహైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్టు పీడీ నీలిమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ డీఎస్ఏ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన అండర్-19 బాలికల టెన్నిస్ పోటీల్లో పి.పుష్పలత, కె.వీరశ్రావణి తిరువూరు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిద్దరూ ఈనెల 28నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గ్రామాలను దత్తత తీసుకోవాలి



ఉన్నత అభియాన్ సమన్వయకర్త పావని భీశెట్టితో విద్యార్థులు

తాళ్లరేవు: కళాశాలలకు అనుబంధంగా ఉన్న గ్రామాలను దత్తత తీసుకుని విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లతో కలిసి వాటి అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని కేంద్ర విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో భారతదేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉన్నత్ భారత్ అభియాన్ ఆంధ్ర యూనివర్శిటీ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ పావని భీశెట్టి తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పావని మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కళాశాల సిబ్బంది, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, డీన్ డాక్టర్ వీరభద్రరావు, డీడీ రవీంద్రరెడ్డి, రీసెర్చ్ హెడ్ డాక్టర్ వంశీ, సుమ, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 సిలిండర్లు స్వాధీనం

ఇద్దరు వ్యాపారులపై కేసు



అధికారులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎం.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులుమంగళవారం అమలాపురం మండలం భట్నవిల్లిలోని తనిఖీలు చేసి, అక్రమంగా ఉంచిన 17 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బలభద్ర మల్లిఖార్జునరావు ఇంటి వద్ద 9 డొమెస్టిక్(గృహ) సిలిండర్లును, భలభద్ర పాపారావు కిరణా, కూల్ డ్రింక్స్ షాపులో ఎనిమిది డొమెస్టిక్(గృహ) సిలిండర్లును స్వాధీనం చేసుకుని, సంబంధిత షాపుల యాజమానులపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత మాట్లాడుతూ గొమెస్టిక్(గృహ) సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడిన, అక్రమ నిల్వ ఉంచిన సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారి నాగవెంకటరాజు, నవీన్ కుమార్, వలీ, లోవరాజు, సీఎస్‌డీటీ భారతి పాల్గొన్నారు.